kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

సోమవారం ● 27-04-2026

పేజీలు: 3



SINGLE TOPIC

స్వరాష్ట్రంలో ఆర్టీసీ



# అవమానం.. ఆత్మగౌరవం!



## ఆర్టీసీ సమ్మెపై నాడు కేసీఆర్ వైలెంట్.. నేడు రేవంత్ బ్రిలియెంట్

### గత సర్కార్‌లో 52 రోజులు కొనసాగిన సమ్మె

మొదటి రోజు నుంచి కార్మికులపై కాలుదువ్విన నాటి సీఎం కేసీఆర్

ఆర్టీసీని దేవుడు కూడా రక్షించడంటూ కామెంట్లు.. హెచ్చరికలు

48వేల మంది 'సెల్ఫ్ డిస్‌మిస్' అయిపోయినట్లేనంటూ హుకుం

మనస్థాపంతో ప్రాణాలు కోల్పోయిన 34 మంది కార్మికులు

### నేడు మూడు రోజుల్లోనే ముగిసిన సమ్మె

డ్రైవర్ ఆత్మహత్యతో కలకలం.. కార్మికుల డిమాండ్లకు ప్రభుత్వం అంగీకారం

ఆర్టీసీ సమ్మె ముగిసింది. ఇరు పక్షాలూ చెరో మెట్టు దిగడంతో మూడు రోజుల్లోనే పరిష్కారమైంది. గత ప్రభుత్వంలో 52 రోజుల పాటు కొనసాగిన సమ్మె కాలంలో 34 మంది కార్మికులు సూసైడ్ చేసుకున్నారు. కానీ, ఈసారి మూడు రోజుల్లోనే ముగియడంతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమైంది. ఇది ఎలా సాధ్యమైందని కొద్దిమంది ఆశ్చర్యపోయారు. చర్చలకు వచ్చిన ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు సైతం గత ప్రభుత్వం, ఇప్పటి ప్రభుత్వం వ్యవహరించిన తీరును పోల్చుకున్నారు. అప్పటి చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

ఆర్టీసీ సమ్మెపై అప్పట్లో సీఎం హోదాలో కేసీఆర్ చేసిన కామెంట్లను తల్చుకున్న ప్రతినిధులు ఒకింత ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యారు. "సెల్ఫ్ డిస్మిస్ అయిపోయారు... యూనియన్ల అతి ప్రవర్తనతోనే సమ్మె.. మోనోపలీతో దురహంకారం ప్రదర్శిస్తున్నాయి.. వారు ఎక్కిన చెట్టుకొమ్మను వారే నరుక్కున్నారు.. భవిష్యత్తులో యూనియనిజం ఉండదు.. అవి వాటి అస్థిత్వాన్ని కోల్పోయినట్లే.. యూనియన్ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు ప్రభుత్వం తల వంచదు".. ఇలాంటి కామెంట్లతో ఆత్మగౌరవం దెబ్బతిన్నదని ప్రతినిధులు వాపోయారు.

గత ప్రభుత్వంలో సమ్మెను స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ డీల్ చేశారు. అయినా 52 రోజుల పాటు సమ్మె కొనసాగింది. ఈసారి నేరుగా ఎక్కడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోలేదు. మంత్రులు, అధికారుల స్థాయిలోనే కమిటీలు వేసి పరిష్కారం కోసం గైడ్ చేశారు. ఆర్టీసీ జేఏసీ ప్రతిపాదించిన డిమాండ్లలో హెచ్చు శాతం గత ప్రభుత్వం నుంచీ కొనసాగుతున్నవే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేండ్లలో కొత్తగా పుట్టుకొచ్చిన డిమాండ్లేవీ లేవు. ప్రభుత్వాలు వ్యవహరించే తీరుతో పరిష్కారంలో వ్యత్యాసాన్ని జేఏసీ గమనించింది.

గత ప్రభుత్వంలో "ఇకపై యూనియనిజం ఉండదు.. యూనియన్లు అస్థిత్వం కోల్పోయాయి.." లాంటి కామెంట్లకు తగ్గట్లుగానే యూనియన్లకు ఎన్నికల్లేవ్.. ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్మిక సంఘమూ లేదు. ఇప్పుడు కార్మికులకు ఆ స్వేచ్ఛ లభించింది. గత ప్రభుత్వంలో సమ్మె సందర్భంగా స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ చేసిన కామెంట్లేంటి?.. ఆ కామెంట్లపై హైకోర్టు రియాక్షన్ ఏంటి?.. ఇప్పటి ప్రభుత్వం సమ్మెను ఎలా కొలిక్కి తేగలిగింది?.. వీటిపై కలం స్పెషల్...

- సెంట్రల్ డెస్క్, కలం






2019 అక్టోబర్‌లో సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికులు.. నాడు బస్ భవన్ ఎదుట నిరసనకు దిగిన కార్మికులపై పోలీసుల లాఠీచార్జ్



ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ నేతల చర్చలు ఫలించడంతో శనివారం మెదక్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న కార్మికులు





## గత ప్రభుత్వంలో సమ్మె ఎలా మొదలైంది? :

ఆర్టీసీ కార్మికులు 2019 అక్టోబర్ 5 (4వ తేదీ అర్ధరాత్రి) నుంచి నిరవధిక సమ్మె మొదలుపెట్టారు. మొత్తం 26 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ప్రభుత్వానికి పలుమార్లు మొరపెట్టుకున్నా, లేబర్ కమిషనర్‌కు నోటీసు ఇచ్చినా డిమాండ్ల పరిష్కారం దిశగా ఎలాంటి చర్యలు లేవని, గత్యంతరం లేనందునే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని జేఏసీ పేర్కొన్నది. అప్పట్లో జేఏసీ చైర్మన్‌గా ఉన్న అశ్వత్థామరెడ్డిని ఉద్దేశిస్తూ సీఎం హోదాలో కేసీఆర్ ఘాటు కామెంట్లే చేశారు. సమ్మె పరిష్కారం దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోకపోగా రెచ్చగొట్టే తీరులో వ్యవహరించిందని, కేసీఆర్ వ్యాఖ్యలతోనే కార్మికుల ఆత్మగౌరవం దెబ్బతిన్నదని కార్మికులు బహిరంగంగానే చెప్పారు. చివరికి అది హైకోర్టు వరకూ వెళ్లింది. 52 రోజుల సమ్మె అనంతరం నవంబర్ 25న విరమణ ప్రక్రియ పూర్తయింది.



## ఆర్టీసీ సమ్మెపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలేంటి?

ఆర్టీసీ కార్మికుల చేస్తున్న సమ్మె చట్టవిరుద్ధమైనదని నాడు కేసీఆర్ ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. కానీ, జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ నేతృత్వంలోని బెంచ్ మాత్రం.. "ఈ సమ్మె చట్టబద్ధమా?.. లేక చట్టవిరుద్ధమా?.. అనేది తేల్చాల్సింది లేబర్ కోర్టు. దానికే ఆ అధికారమున్నది" అని స్పష్టం చేసింది. ఫలానా టైమ్ లోగా విధుల్లో చేరకపోతే కార్మికులు 'సెల్ఫ్ డిస్మిస్' అయిపోయినట్లే అని ప్రభుత్వం చెప్పడాన్ని ప్రస్తావించి "మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం.. బ్రిటీషు యుగంలో లేం.. ఒకేసారి మూకుమ్మడిగా 48 వేల మంది కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ అని ప్రభుత్వం చెప్పడమంటే అది వారికి ఆర్థిక మరణమే అవుతుంది.. ప్రభుత్వం ఒక 'మోడల్ ఎంప్లాయర్'గా ఉండాలి.. కార్మికులకు వారి సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కు ఉంటుంది.. అంతమాత్రం చేత వారి ఉద్యోగాలు పీకేయడం సమంజసం కాదు.." అని స్పష్టం చేసింది.



### మొదటి రోజు రివ్యూలోనే కేసీఆర్ హాట్ కామెంట్స్.. (2019 అక్టోబర్ 4)

"ఆర్టీసీ డిపోల్లో రిపోర్టు చేసినవారినే ఉద్యోగులుగా గుర్తిస్తాం. చేరనివారిని తమంతట తాముగా ఉద్యోగాలు వదిలిపెట్టినవారిగా గుర్తిస్తాం. విధుల్లో చేరని వారిని తిరిగి ఉద్యోగంలో చేర్చుకోం. ఇది ప్రభుత్వ విధాన నిర్ణయం. ఇది చట్టవిరుద్ధమైన సమ్మె. వారిని తొలగించే అధికారం సంస్థకు ఉన్నది. యూనియన్ నాయకుల ఉచ్చులో పడి కార్మికులు సంస్థకు నష్టం చేయవద్దు. తమ ఉద్యోగాలను తామే పోగొట్టుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. చర్చల కోసం ఏర్పడిన అధికారుల కమిటీ రద్దయింది. డిమాండ్లపై ఇక చర్చలు ఉండవు. కార్మికులే ఆర్టీసీని ముంచే పని చేస్తున్నారు. ఆర్టీసీని కాపాడడం కష్టం. సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రైవేటు బస్సుల్ని తెప్పిస్తాం. ప్రైవేటు నుంచి 2100 బస్సుల్ని అద్దెకు తెచ్చుకుంటాం. అవసరమైతే పర్మిట్ ఫీజులో 25% రాయితీ ఇస్తాం. సుమారు ఐదు వేల మంది టెంపరరీ డ్రైవర్లు రావడానికి సిద్ధంగా ఉన్నారు'' అని కేసీఆర్ అన్నారు.



### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదు: కేసీఆర్ (2019 అక్టోబర్ 6)

"ఎట్టి పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదు. మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, మణిపూర్ రాష్ట్రాల్లో ఆర్టీసీ లేనే లేదు. బిహార్, ఒడిశా, జమ్మూకాశ్మీర్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఉన్నా అది నామమాత్రమే. కర్నాటక తర్వాత ఎక్కువ ఆర్టీసీ బస్సులు ఉన్నది తెలంగాణలోనే. సీపీఎం అధికారంలో ఉన్న కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో ఆర్టీసీ విలీనమైందా? బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి విలీనం జరిగిందా? కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో విలీనమైందా? అందుకే ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రేమ ఒలకబోసే కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీలకు ఇప్పుడు విలీనం గురించి అడిగే హక్కు లేదు. అఖిలపక్ష సమావేశాన్ని డిమాండ్ చేయడం అసంబద్ధం. ఇంత మంచి తెలంగాణ ఆర్టీసీలో కార్మికులు సమ్మెకు దిగడం అవసరమా? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వాళ్ల కళ్లను తెరిపించాలి. యూనియన్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు ప్రభుత్వం తలవంచదు" అని కేసీఆర్ అన్నారు.



### జీతం పెంచాలని అడగడం అర్థరహితం: కేసీఆర్ (2019 అక్టోబర్ 6)

''పండుగల సీజన్‌లో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడం తీవ్రమైన తప్పిదం.. క్రమశిక్షణారాహిత్యం.. బ్లాక్‌మెయిల్ విధానం. ఇప్పటికే డీజిల్ ధరలు పెరిగి ఆర్టీసీ ఇబ్బందుల్లో ఉన్నది. సంవత్సరానికి రూ.1,200 కోట్ల నష్టం వస్తున్నది. దీనికి తోడు 5వేల కోట్ల రుణభారం ఉన్నది. ఆర్టీసీ మనుగడ సాగించాలంటే కొన్ని చర్యలు తప్పవు. విధుల్లో చేరిన 1,200 మంది మాత్రమే ఆర్టీసీ ఉద్యోగులు. కొద్ది రోజుల్లోనే కొన్ని షరతులతో కొత్త సిబ్బందిని నియమిస్తాం. అలా చేరేవారు యూనియన్లలో చేరబోమని అగ్రిమెంట్ మీద సంతకం చేయాలి. 40 సంవత్సరాలుగా ఆర్టీసీలో సమస్యలు అల్లుకుపోయాయి. శాశ్వత పరిష్కారం కనుగొనాలి. తలనొప్పి కలిగించే చర్యలు ఉండకూడదు. సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రజలు చాలా కోపంగా ఉన్నారు. సోషల్ మీడియాలో కూడా వ్యతిరేకత వస్తున్నది. గడప దాటితే బయటకే.. మళ్లీ గడప లోపలికి వచ్చే సమస్యే లేదు. ఆర్టీసీ స్టాఫ్ యావరేజ్‌గా నెలకు రూ.50 వేల జీతం తీసుకుంటున్నారు. ఇంకా పెంచాలని అడగడంలో అర్థం లేదు" అని కేసీఆర్ కామెంట్లు చేశారు.



### ఆర్టీసీలో ఇకపై మూడు రకాల బస్సుల వ్యవస్థ: కేసీఆర్ (2019 అక్టోబర్ 7)

"ఆర్టీసీలో భవిష్యత్తులో మూడు రకాల బస్సులుంటాయి. మొత్తం 10,400 బస్సుల్లో సగం పూర్తిగా ఆర్టీసీకి చెందినవి. మరో 30% (3,100) ఆర్టీసీ పర్యవేక్షణలో నడిచే అద్దె బస్సులు. ఇవి ఆర్టీసీ డిపోల్లోనే ఉంటాయి. మిగిలిన 20% (2,100) పూర్తిగా ప్రైవేటువి. స్టేజ్ క్యారేజీగా అనుమతి ఇస్తాం. పల్లె వెలుగు సర్వీసుతో పాటు ఇతర రూట్లలో సిటీలో కూడా నడుస్తాయి. ఛార్జీలు మాత్రం ఆర్టీసీ నియంత్రణలోనే ఉంటాయి. ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటుపరం చేయడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. క్రమశిక్షణను తు.చ. తప్పకుండా అమలు చేస్తాం. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నాం. రవాణా కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ కొన్ని ప్రతిపాదనలు తయారు చేసింది. వాటిపై కూలంకషంగా చర్చించిన తర్వాత పైనిర్ణయాలు తీసుకున్నాం. ఆర్టీసీ ప్రక్షాళన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు ప్రశంసిస్తున్నారు" అంటూ కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు.

### కార్మికులను క్షమించే ప్రసక్తే లేదు: కేసీఆర్ (2019 అక్టోబర్ 12)

"ఆర్టీసీ కార్మికుల సమ్మె చట్ట విరుద్ధం. దీన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో గుర్తించదు. వారితో చర్చలు జరపదు. విధుల్లో చేరనివారిని తిరిగి చేర్చుకోం. అలా తీసుకునే అవకాశమే లేదు. ఇక చర్చలు జరిపే అంశమే ఉత్పన్నం కాదు. సెప్టెంబర్ నెల జీతాలు యథావిధిగా ఇస్తాం. యూనియన్ నాయకుల పిచ్చిమాటలు నమ్మి కార్మికులు సమ్మెకు దిగారు. విధులకు దూరమయ్యారు. చివరకు వారంతట వారు ఉద్యోగాలను వదులుకున్నారు. అంతే తప్ప వారిని ఎవరూ డిస్మిస్ చేయలేదు. గతంలో ఎన్నడూ సూపర్‌వైజర్లు సమ్మె చేయలేదు. ఈసారి వారిని కూడా యూనియన్లు లాగాయి. ఆర్టీసీని నష్టపర్చిన కార్మికులను క్షమించే ప్రసక్తే లేదు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. యూనియన్ల బాధ్యతా రాహిత్యంతో 48 వేల మంది ఉద్యోగాలు పోయాయి" అంటూ కేసీఆర్ నోటికొచ్చినట్లు అనేశారు.



### సమ్మెకు ప్రతిపక్షాల మద్దతు అనైతికం: కేసీఆర్ (2019 అక్టోబర్ 12)

"ఆర్టీసీ కార్మికులు అర్థరహిత డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు. ఆ సమ్మె చట్టవిరుద్ధమైనది. రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వడం అనైతికం. న్యాయసమ్మతం కాని కోర్కెలతో సమ్మె చేయడానికి మద్దతు ఎలా ఇస్తాయి? రాష్ట్రంలో అసలు ప్రతిపక్షమే లేదు. రాష్ట్రంలో 'నాదాన్ దుష్మన్' అనే పరిస్థితి ఉన్నది. రాజకీయ ప్రయోజనం కోసం గోతికాడి నక్కల్లా ప్రతిపక్షాలు ఎదురు చూస్తున్నాయి. ప్రజల నుంచి వాటికి ఛీత్కారం తప్పదు. గతంలో ఇలాంటి చాలా విషయాల్లో తప్పుడు వైఖరి కారణంగానే ప్రజల మద్దతు కోల్పోయాయి. ఇప్పుడు ఆర్టీసీ విషయంలోనూ అదే జరుగుతున్నది. ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రస్తావిస్తున్న ప్రతిపక్షాలేవీ అవి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయడం లేదు. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని యూనియన్లు అంటున్నాయి. పార్టీలు సపోర్టు చేస్తున్నాయి. కానీ ఎంత ఉధృతం చేసినా, ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా ప్రభుత్వం చలించదు. బెదిరింపులకు భయపడదు" అంటూ కేసీఆర్ విరుచుకుపడ్డారు.

### యూనియన్లది దాష్టీకం: కేసీఆర్ (2019 అక్టోబర్ 7)

"యూనియన్ల గుత్తాధిపత్యం, దాష్టీకం కారణంగానే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. ఇష్టమొచ్చినట్లు సమ్మె చేస్తామనడం దురహంకారమే. ఏది జరిగినా ప్రభుత్వ అనుమతితోనే జరగాలి. విధుల్లో చేరనప్పుడు ఇక యూనియన్ల ప్రసక్తే లేదు. అవి వాటి అస్తిత్వాన్ని కోల్పోయాయి. భవిష్యత్తులో ఆర్టీసీలో యూనియనిజం ఉండదు. గడువు లోపల విధుల్లో చేరనందున కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయిపోయారు. ఎవరూ ఎవర్నీ డిస్మిస్ చేయలేదు. వాళ్లంతట వారే తొలగిపోయారు. డిస్మిస్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేనే లేదు. డిపోల దగ్గర గొడవ చేస్తే చర్యలు తప్పవు. ప్రత్యేక పోలీసు బృందాలు అక్కడ ఉంటాయి. ఆర్టీసీ యూనియన్ల అతి ప్రవర్తన వల్లనే ఈ పరిస్థితి దాపురించింది. వారు ఎక్కిన కొమ్మను వారే నరుక్కున్నారు" అంటూ కేసీఆర్ హెచ్చరికలు జారీ చేశారు.

### హైకోర్టు తేల్చగలిగిందేమీ లేదు: కేసీఆర్ (2019 నవంబర్ 4)

"హైకోర్టులో జరుగుతున్న విచారణను కార్మికులకు చూపి యూనియన్ నాయకులు మభ్యపెడుతున్నారు. న్యాయ నిపుణుల ప్రకారం సమ్మె విషయంలో ప్రభుత్వానికి కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇచ్చే అవకాశం లేదు. కోర్టు తేల్చగలిగింది కూడా ఏమీ లేదు. హైకోర్టు తీర్పు ప్రభుత్వ అభిప్రాయానికి భిన్నంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్తాం. ఒకవేళ సుప్రీంకోర్టుకు వెళ్తే అక్కడ విచారణ మరింత ఆలస్యం అవుతుంది. గత అనుభవాలను బట్టి చూస్తే సుప్రీంకోర్టులో నెలల తరబడి, కొన్నిసార్లు సంవత్సరాల తరబడి కేసుల విచారణ జరుగుతున్నది. అప్పుడు 'అంతులేని పోరాటం'గా మారుతుంది. దీంతో కార్మికులకు ఒరిగేదేమీ ఉండదు. ఇంతదూరం వచ్చిన తర్వాత ఆర్టీసీ కూడా సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చేమో..న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్నాం. కార్మిక చట్టాలనూ స్టడీ చేశాం. కోర్టు విచారణలో అనుసరించాల్సిన వైఖరిపై చర్చించాం" అంటూ కేసీఆర్ పేర్కొన్నారు.

### ఇక ఆర్టీసీ ఉండదు: కేసీఆర్ (2019 నవంబర్ 4)

"ఎన్నిసార్లు అవకాశం ఇచ్చినా విధుల్లో చేరని ఉద్యోగులను తిరిగి చేర్చుకునేది ఉండదు. ఉద్యోగాలను కాపాడుకోవడమా?.. లేక అవకాశాన్ని చేజార్చుకుని కుటుంబాన్ని ఇబ్బందులపాలు చేయడమా?.. కార్మికులే తేల్చుకోవాలి. 5 వేల రూట్లలో ప్రైవేటు బస్సులకు పర్మిట్లు ఇస్తాం. దీంతో తెలంగాణలో ఆర్టీసీ మాయమవుతుంది. ఆర్టీసీ లేని రాష్ట్రంగా మారడానికి ముమ్మాటికీ కార్మికులే కారణమవుతారు. విధుల్లో చేరేందుకు గడువు ఇచ్చినా, మంచి అవకాశం కల్పించినా కార్మికులు వినియోగించుకోవడం లేదు. కార్మికుల భవిష్యత్తు, వారి కుటుంబాల భవిష్యత్తు ఎవరి చేతుల్లోనూ లేదు. పూర్తిగా కార్మికుల చేతుల్లోనే ఉన్నది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో గడువు ఇచ్చింది. వినియోగించుకోకపోతే అర్థం లేదు. ఇకపైన కార్మికులు ఎవరినీ బదనాం చేయలేరు. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా ఉంది" అని కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారు.



## నాడు 52 రోజులు హేళన చేసి, వేధించి.. ఆపై విందు!

2019 అక్టోబర్ 5న సమ్మెలోకి దిగిన ఆర్టీసీ కార్మికులు.. నాటి సీఎం కేసీఆర్ మాటలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆయన ఎన్ని హెచ్చరికలు చేసినా, ఎంత బెదిరించినా.. పట్టు వదలకుండా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేశారు. హైకోర్టు ఆదేశాలతో చివరికి కార్మిక సంఘాలు నవంబర్ 25న సమ్మె విరమించాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు 52 రోజుల పాటు సుదీర్ఘంగా సమ్మె సాగింది. కార్మికులు సమ్మె విరమించిన రెండు రోజుల తర్వాత కేసీఆర్ కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి 'బేషరతు'గా ఆర్టీసీ సిబ్బందిని విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. 2019 డిసెంబర్ 1న తన అధికారిక బంగళా ప్రగతి భవన్‌కు అన్ని డిపోల నుంచి సుమారు 2,500 మంది కార్మికులని పిలిపించుకుని విందు ఇచ్చారు. అప్పటి వరకు కార్మికులను హేళనగా మాట్లాడిన కేసీఆర్ వరాలు కురిపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. విధుల నుంచి ఎవరినీ తొలగించబోమని చెప్పారు.

- సమ్మె సందర్భంగా కేసీఆర్ అనుసరించిన తీరును ఆర్టీసీ కార్మికులు మరిచిపోలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో బదులిచ్చారు. ఆ దెబ్బకు కేసీఆర్ గద్దె దిగి ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి వచ్చింది.
- తాజాగా జరిగిన మూడు రోజుల సమ్మెలో బీఆర్ఎస్ నేతలు సంఘీభావం ప్రకటించడానికి వచ్చినప్పుడు కూడా ఆర్టీసీ కార్మికులు 52 రోజుల సమ్మె కాలంలో కేసీఆర్ పెట్టిన టార్చర్ అంతా ఇంతా కాదని గుర్తుచేసుకున్నారు. కొన్ని చోట్ల ఆ నేతలను దరిదాపుల్లోకి కూడా రానివ్వని ఘటనలూ ఉన్నాయి.



# నేడు చర్చలతో మూడు రోజుల్లో ముగింపు

గత ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఒక రకమైన వైఖరి ఉంటే.. ప్రస్తుత ప్రభుత్వంలో దానికి పూర్తిగా భిన్నమైన విధానం అమలైంది. ఫలితంగా అప్పట్లో 52 రోజుల సమ్మె, కోర్టులో విచారణ అనివార్యమైంది. నాడు సీఎం హోదాలో కేసీఆర్ చేసిన కామెంట్లకు మనస్తాపం చెంది 34 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్న వాదన ఉంది. ప్రస్తుతం చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం ఉంటుందనే విధానంతో మూడు రోజుల్లోనే సమ్మె విరమణ చేశారు కార్మికులు. ప్రస్తుత మూడు రోజుల సమ్మెలో రెండో రోజు వరంగల్ జిల్లా నర్సంపేటలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం కార్మికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది.

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అసాధ్యమని నాడు సమ్మె టైమ్‌లో కేసీఆర్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తే.. లీగల్, టెక్నికల్ అంశాలపై స్టడీ చేసి త్వరలోనే నిర్ణయాన్ని తీసుకుంటామని ప్రస్తుత ప్రభుత్వం తెలిపింది.
- ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన 2021 పీఆర్సీ పే స్కేల్ అమలుకు, అందరికీ 11% ఫిట్‌మెంట్ ఇవ్వనున్నట్లు ప్రస్తుత సర్కార్ చెప్పడంతో సమ్మె విరమణకు ఆర్టీసీ జేఏసీ ఆమోదం తెలిపింది.
- గత ప్రభుత్వంలో యూనియన్ల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తే.. ఈసారి మాత్రం వాటిని పునరుద్ధరించి గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయం జరిగింది. ప్రజాస్వామ్యబద్ధంగా కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను నిర్వహించేందుకు త్వరలోనే కార్మిక సంఘాలతో చర్చలు, విధివిధానాల ఖరారు, సంయుక్త ప్రకటన వెలువడనున్నది.